క్లుప్తంగా

ఉపాధ్యాయులంతా ఐక్యంగా మెలగాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : ఉపాధ్యాయులంతా ఐక్యతతో మెలగి విద్యా బోధనలో మరిన్ని మార్పులు తీసుకురావాలని మండల పీఆర్టీయు సంఘ నాయకులు అన్నారు. పెద గుమ్ములూరు ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సమావేశంలో మాట్లాడారు. మహిళా సాధికారిత సంబరాల్లో భాగంగా మహిళలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయు అధ్యక్ష, కార్యదర్శులు భద్రరావు, శ్రీనివాస్, ప్రసాద్, చక్రవర్తి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు


రామగిరిలో పింఛన్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోజా లక్ష్మి అన్నారు. రామగిరిలో ఆదివారం అర్హులైన లబ్ధిదారులకు ఆమె పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు బాబూరావు, పల్లా రాజు, సన్ని బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు


అరబుపాలెంలో అక్షింతలతో ఊరేగింపు

మునగపాక : అరబుపాలెంలో అయోధ్య అక్షింతల ఊరేగింపు ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అక్షింతలను కలశాలతో ఊరేగించారు. స్థానిక రామాలయంలో భక్తుల దర్శనార్థం అక్షింతలు ఉంచిన తర్వాత ఆదివారం అన్ని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బుజ్జి, దేవస్థానం నిర్వాహకులు రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్


గుండె శస్త్ర చికిత్స చేసుకున్న సాంబమూర్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భారతి

మునగపాక : తమకు అప్పగించిన బాధ్యతలను వలంటీర్లు సక్రమంగా నిర్వహిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. మునగపాక గ్రామానికి చెందిన బొయిదాపు సాంబమూర్తి విశాఖలోని మెడిక్యూర్ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకొని వైద్యం పొందుతున్నారు. దీంతో సంబంధిత వలంటీర్ ఆడారి భారతి ఆదివారం సాంబమూర్తికి చెందిన జనవరి నెల పింఛన్ రూ.3వేలను అందజేసి అందరి మన్ననలు పొందారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేన ముందుంటుందని జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ అన్నారు. మునగపాకలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన మండల జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన, టీడీపీ కూటమి విజయం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని, ప్రజలతో మమేకం అవుతూ కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఆనంద్, ఆడారి శ్రీకాంత్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంకేతిక విప్లవం

విద్యారంగంలో సాంకేతిక విప్లవానికి జగనన్న శ్రీకారం చుట్టారు. విద్యాభివృద్ధికి జగనన్న సర్కారు ఎంతో ప్రాధాన్యమిస్తుంది. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టారు. అంతేగాక కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నాడు–నేడు మన బడి పథకంలో సరికొత్త హంగులతో భవనాలను నిర్మించింది.




ట్యాబ్‌లతో విద్యార్థినులు

- విద్యాభివృద్ధికి జగనన్న బాటలు
- అందుబాటులోకి డిజిటల్ ప్యానల్ బోర్డులు
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు
- బైజూస్ కంటెంట్‌తో విద్యార్థులకు మేలు

రాంబిల్లి: పాఠశాలల్లో సాంకేతిక విప్లవాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకువచ్చారు. తరగతి గదుల్లో బ్లాక్ బోర్డుల స్థానంలో ఐఎఫ్‌పీ(ఇంటరాక్షన్ ఫ్లాట్‌ఫాం ప్యానెల్) డిజిటల్ బోర్డులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ బోర్డులు అంత్యంత సాంకేతికపరంగా ఉన్నాయి. ఇంటర్‌నెట్‌తో కనెక్ట్ అయి ఉండడంతో పాఠ్యాంశాలు బోధించేటపుడు అవసరమైన అంశాలను ఈ బోర్డుపై డిస్‌ప్లే చేసే అవకాశం ఉంది. దీంతో పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతున్నాయి. దీంతో పాటు ఉపాధ్యాయులు బోధన చేసిన అంశాలు రికార్డు అయి స్టోరేజి కూడా అవుతున్నాయి. అంటే బోధన చేసిన పాఠ్యాంశాలను తర్వాత కూడా చూచుకోవచ్చు. అంతేగాక 8వ తరగతి చదువుకునే విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందజేశారు. ఈ ట్యాబ్‌ల సహకారంతో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. డిజిటల్ బోధనతో ఇక విద్యార్థులు మరింత మెరుగైన విద్యను అభ్యసించే అవకాశం దక్కింది. గత ప్రభుత్వాల హయాంలో శిథిల భవనాలు, ఉపాధ్యాయుల కొరత, వసతుల కొరత ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

రాంబిల్లి మండలంలో పాఠశాలలు వివరాలు..

ప్రాథమిక పాఠశాలలు 42	ప్రాథమికోన్నత పాఠశాలలు 7
ఉన్నత పాఠశాలలు 9	మొత్తం విద్యార్థుల సంఖ్య 4362
మొత్తం పాఠశాలలు 58	మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య 217
ఐఎఫ్‌పీ బోర్డులు 27	పంపిణీ చేసిన ట్యాబ్‌లు 986


ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు


ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డుపై బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయి



ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డులతో బోధన చాలా బాగుంది. సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయి. చదువుపై ఎంతో ఆసక్తి కలుగుతుంది. వీటిని ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధిస్తాం

– తేజస్విని, విద్యార్థిని

చాలా ఉపయోగకరం



పాఠశాలల్లో ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడం గొప్ప విషయం. లక్షలాది రూపాయలు వెచ్చించి వీటిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఉపాధ్యాయులకు వీటితో బోధన చేయడం ఎంతో బాగుంది. అవసరమైన కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మరింత అర్థమయ్యేలా బోధన చేస్తున్నాం

– చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు

సాంకేతికను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కార్పొరేట్ విద్యార్థులతో సర్కారీ స్కూల్ విద్యార్థులు పోటీ పడేందుకు అవసరమైన వనరులను సమకూర్చడం జరుగుతుంది. వీటిని వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

– ఎం. సూర్యారావు, మండల విద్యా శాఖాధికారి

పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జోగులు


వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని పరిశీలించిన సమన్వయకర్త కంబాల జోగులు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యలయం ఏర్పాటును నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పరిశీలించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం, మెయిన్‌రోడ్డులో ముస్తాబైంది. ఈ కార్యాలయాన్ని నియోజకవర్గ సమన్వయకర్త పరిశీలించారు. ఆయనతో పాటు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, బీసీ నాయకులు మైలపల్లి అశోక్ చక్రవర్తి, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామస్థాయి పోటీలు


ఆడుదాం - ఆంధ్ర ముగింపు కార్యక్రమంలో నాయకులు

పాయకరావుపేట : మండలంలో ఆడుదాం –ఆంధ్రా కార్యక్రమానికి ఆదివారం ముగింపు వేడుకలు జరిగాయి. డిసెంబరు 26 నుంచి జనవరి 6 వరకు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడలు కొనసాగాయి. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ ఆడి నాయకులు ముగింపు పలికారు. జెడ్పీటీసీ సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఉప సర్పంచ్ జగతా జవానీ శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు మోహన్, సతీష్, జగతా శ్రీనివాస్ సన్యాసిరావు, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిమెంట్ కాలువకు ప్రారంభోత్సవం


రాజుగారి బీడులో సిమెంట్ కాలువ ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి

పాయకరావుపేట : పట్టణంలో గల రాజుగారి బీడులో సిమెంట్ కాలువను ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో పాటు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ప్రారంభించారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా, వర్షం నీరు పోవడానికి రూ.10 లక్షలు ఎంపీ నిధులతో ఈ కాల్వను నిర్మించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పంచాయతీ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు


కుమ్మరాపల్లి సమీపంలో వరి కోతలు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు మరో నాలుగైదు రోజుల్లో పూర్తి కానున్నాయి. ఇప్పటికే కోసి ఆరబెట్టిన పనలను రైతులు కుప్పలుగా వేశారు. ప్రస్తుతం కోసిన పనలను మరో నాలుగైదు రోజుల్లో కుప్పలుగా వేయనున్నారు. మండలంలో ఈ ఏడాది సుమారు 4వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనిలో 1700 ఎకరాల్లో వరిపంట మిచాంగ్ తుపానుతో దెబ్బతింది. పంట నష్టపోయిన రైతుల జాబితాలను వ్యవసాయశాఖ గుర్తించింది. వారికి ప్రభుత్వం పరిహారం అందించనుంది. మరోపక్క రబీ సాగు చేసే రైతులు నారు పెంచుతున్నారు.

పేకాట, కోడిపందాల జోలికిపోవద్దు


ఎస్‌ఐ రమణయ్య

కోటవురట్ల : సంక్రాంతి పండగను బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకోవాలని, కోడి పందాలు, పేకాట జోలికి పోవద్దని ఎస్‌ఐ బి.రమణయ్య కోరారు. ఆయన మాట్లాడుతూ పండగ నేపథ్యంలో కోడి పందాలు, పేకాట, జూదం, అక్రమ మద్యం విక్రయాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతల అంశంలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పండగకు దూరపు ఊళ్లు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటికి భద్రత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తీర్థ మహోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఘర్షణలకు తావివ్వరాదని సూచించారు.

బ్రాహ్మణ సంఘం వనభోజన సమావేశం


సాంబశివరావుకు మెమెంటో అందజేస్తున్న సంఘం సభ్యులు


బ్రాహ్మణ కుటుంబ సభ్యులు

అనకాపల్లి : బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలని పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు నేమనూరి సాంబశివ రావు అన్నారు. మండలంలో సత్యనారాయణపురం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ సమీపంలో బ్రాహ్మణ వన సమారాధన–ఆత్మీక కలయిక నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో ఏ పనైనా చేయవచ్చని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులను ఆదుకోవడంలో సంఘం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. జిల్లాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వేడుకగా శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం



అనకాపల్లి : స్థానిక గాంధీనగరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రేజేటి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వివాహం కాని 108 మంది యువతీ, యువకులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


తోటాడ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు


వాడ్రాపల్లిలో వాకర్స్ క్లబ్ సభ్యులు

- వాడ్రాపల్లిలో వాకర్స్ క్లబ్ సభ్యుల వనభోజనం

మునగపాక : తోటాడ హైస్కూల్లో 1998–99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఉన్న లే-అవుట్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి యల్లపు కృష్ణ, పొలమరశెట్టి నాగత్రినాథ్, బొడ్డేడ శ్రీను, కొణతాల శ్రీను, ఆడారి ప్రసాద్, బొడ్డేడ జగ్గప్పారావు నేతృత్వం వహించారు. మునగపాకకు చెందిన వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు, సభ్యులు వెలగా శ్రీనివాసరావు, మళ్ల జోగారావు, పెంటకోట చిన్న, అప్పారావు, కోరుకొండ ప్రసాద్, సూరిశెట్టి ప్రసాద్, రామప్పలనాయుడు, సూరిబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు


దేవవరంలో రాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఆదివారం దేవవరం గ్రామంలో విశ్వ హిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అక్షింతలను జైశ్రీరాం నినాదాలతో భారీ ఊరేగింపుతో చిన్నారుల కోలాటం, భజన గీతాల నడుమ ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ట, రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరగనున్న నేపథ్యంలో వాడ వాడలా అక్షింతలు పంపిణీ కార్యక్రమం నేత్రపర్వంగా జరుగుతోంది. కార్యక్రమంలో సర్పంచ్ రాఘవకుమారి నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ దేవర సత్యవనారాయణ, వీహెచ్‌పీ సభ్యులు రామాల శ్రీను, ఇసంపల్లి వరహాలు, కె.సూర్యగణేష్, దేవవరం భజన బృందం, కోలాటం సభ్యులు పక్కుర్తి సత్తిబాబు, బత్తుల రమణ, తేలుగుంట స్వామి, అర్జునరావు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో...


నారాయణపురం సమీపంలో మంచు కురుస్తున్న దృశ్యం

రాంబిల్లి: మూడు రోజులు కురుస్తున్న మంచు ప్రకృతి ప్రేమికుల మదిని దోచుకుంటుంది. వేకువ జాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంటుంది. సూర్యోదయం వేళ సూర్య కిరణాలను మంచు తెరలను చీల్చితూ కాంతులీనుతుంటే కనుచూపు మేర చెట్లు, పొలాలు అందంగా కనిపిస్తుంటే ప్రకృతి ప్రేమికులు ఎంతో సంతోషస్తూ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటున్నారు. అయితే ఈ మంచు ప్రభావం అపరాలు(పెసర, మినుము) మొక్కలకు నష్టం కలిగిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

పీహెచ్‌సీ ఆవరణలో తుప్పల తొలగింపు


యంత్రంతో చదును చేస్తున్న దృశ్యం

రాంబిల్లి : దిమిలి పీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం తుప్పలు తొలగింపు పనులు చేపట్టారు. యంత్ర సాయంతో తుప్పలు తొలగించి ఆవరణ స్థలాన్ని చదును చేశారు. స్వచ్ఛభారత్ కింద మండలానికి ఒక యంత్రాన్ని ప్రభుత్వం అందజేసింది. ఈ యంత్రం సాయంతో పనులు చేశారు. సర్పంచ్ బంగారు చిలుకు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శేఖరమంత్రి శ్రీనివాస్, వలంటీర్ డబ్బీరు రాము పాల్గొన్నారు.

క్రీడాకారులు మండల స్థాయిలో రాణించాలి


క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్‌లు అందజేస్తున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయిలో క్రీడాకారులు రాణించాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండలస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం ఆమె స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా దోహదపడుతుందన్నారు. ఈ నెల 10 నుంచి మండల స్థాయిలో జరగనున్న పోటీల్లో రాణించాలన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ వెంకట రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ


ఉద్యోగ విరమణ చేసిన దేముడును సన్మానిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో పని చేసే వారికి ప్రజల్లోను, ఉన్నతాధికారుల్లోను గుర్తింపు లభిస్తుందని అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ తెలిపారు. చోడవరం సబ్ డివిజన్ పోస్టల్ డిపార్టుమెంట్‌లో మైలు ఓవర్‌సీర్‌గా ఉద్యోగ విరమణ చేసిన తానారి దేముడుకు చౌడువాడలో ఆదివారం సన్మానం చేశారు. పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన దేముడు సేవలను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎన్నటికి గుర్తుంచుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు సంజయ్ పాండా, డేన్‌వుడ్ రిసార్ట్ యజమాని దొగ్గ అచ్చింనాయుడు పాల్గొన్నారు.

సీపీఎం నేత బాలకృష్ణ మృతికి సంతాపం

అనకాపల్లి : స్థానిక సీపీఎం సీనియర్ నేత అంగులూరి బాలకృష్ణ ఆదివారం తెల్లవారు జామున విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మూడు మాసాల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో విమ్స్‌లో చికిత్స పొందుతూ షుగర్, కిడ్నీ సమస్యలతో బాలకృష్ణ ఇబ్బంది పడ్డారు. తర్వాత ఆయన డిశ్చార్జి అయి ఇంటి వచ్చారు. మూడు రోజులు క్రితం మరో సారి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కేజీహెచ్‌కు తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు.